# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 2-10-2022 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 53 పేజీలు:6 వెల: రూ.1/-


## వయో వృద్ధుల సంరక్షణ సామాజిక బాధ్యత-శ్రీరామ్ జ్యోతిర్మయి జడ్పీటిసి

మహబూబాబాద్, అక్టోబర్ 1:(నేటినిజం ప్రతినిధి): వయో వృద్ధుల సంరక్షణ సామాజిక బాధ్యతని పెద్దవంగర జడ్పీటిసి శ్రీరామ్ జ్యోతిర్మయి అన్నారు,

అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవము సందర్భంగా పెద్దవంగర మండలంలోని ఆర్సి తండా గ్రామంలో బానోత్ మాజీ 102 సంవత్సరాల వయో వృద్ధురాలిని స్థానిక జడ్పీటిసి శ్రీరాం జ్యోతిర్మయి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థానం కమిటి చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ ,స్థానిక ఎమ్మార్వో రమేష్ బాబు , స్థానిక సర్పంచ్ జాటోత్ చిలకమ్మ హేమాని తదితరులు పాల్గొన్నారు

## తెలుగు రాష్ట్రాల్లో లంపి స్కిన్ వైరస్ కలకలం

హైదరాబాద్, అక్టోబర్ 1:ఇప్పటికే ఎన్నో వైరస్ లు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. అయితే ఇప్పుడు కొత్తగా పశువులకు వైరస్ లు వస్తున్నాయి. తాజాగా.. తెలుగు రాష్ట్రాల్లో లంపి స్కిన్ వైరస్ కలకలం సృష్టిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పశువులకు వైరస్ సోకుతుంది. గత రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో రెండు లంపి స్కిన్ వైరస్ కేసులు నమోదు కాగా.. తాజాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలి కేసు నమోదైంది. నంద్యాలలోని డోన్ మండలం చనుగొండ్లలో ఓ కోడె దూడకు వైరస్ సోకింది. దీంతో పశు వైద్య అధికారులు అప్రమత్తమయ్యారు. గత నెలలో డోన్ సంతలో పశువులను కొనుగోలు చేసినట్టు గుర్తించారు. అయితే, ఇటు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా పశువులకు లంపి స్కిన్ వైరస్ సోకిన విషయం తెలిసిందే.

## టెలికం రంగంలో 5జీ ఓ విప్లవం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: 5జీ టెలికాం సేవలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఇండియన్ మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దంలో భారత్‌కు ఇది చరిత్రాత్మక దినమన్నారు. టెలికాం రంగంలో 5జీ సేవలు విప్లవాత్మక మార్పులు తేనున్నట్లు తెలిపారు. 5జీని ఆవిష్కరించడం అంటే.. 130 కోట్ల మంది భారతీయులకు ఇది టెలికం రంగం ఇచ్చిన గిఫ్ట్ అని అన్నారు. ఈ దేశంలో కొత్త శకానికి ఇదో ముందడుగు అన్నారు. అపరిమిత అవకాశాలకు కూడా ఇది ఆరంభమే అని ప్రధాని తెలిపారు. 5జీ టెక్నాలజీ విషయంలో నవభారత్ కేవలం ఓ వినియోగదారుడిగా ఉండిపోదు అని, ఆ టెక్నాలజీ అభివృద్ధి విషయంలోనూ యాక్టివ్ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధిలో ఇండియా ఇక దూసుకువెళ్తుందని ప్రధాని తెలిపారు.

## ఇంటర్ కాలేజీలకు రేపట్నుంచి దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 1: ఈ నెల 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు దసరా సెలవులు ప్రకటిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 10వ తేదీన ఇంటర్ కళాశాలలు పున:ప్రారంభం కానున్నాయి. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌పై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అతి త్వరలో సికింద్రాబాద్ ప్లాట్‌ఫామ్ టికెట్ ధరలు పెరగబోతున్నాయి

హైదరాబాద్, అక్టోబర్ 1:పెద్ద పండగ వస్తుందంటే చాలు రైల్వే స్టేషన్లు , బస్టాండ్ లు ప్రయాణికులతో కిక్కిరిపోతాయి. దీంతో పండగలను క్యాష్ చేసుకుంటారు. బస్సు చార్జీలు పెంచడం , ప్రత్యేక బస్సు లు వేసి అదనపు చార్జీలు వసూళ్లు చేయడం, అలాగే రైల్వే స్టేషన్స్ ల్లోనూ ప్లాట్‌ఫామ్ టికెట్ ధరలు పెంచడం , ప్రత్యేక ట్రైన్స్ అందుబాటులోకి తీసుకరావడం , వాటికీ అధిక చార్జీలు వసూళ్లు చేయడం చేస్తుంటారు. ప్రస్తుతం ఇప్పుడు అదే చేస్తున్నారు. దసరా పండగను క్యాష్ చేసుకునే పనిలో పడింది దక్షిణ మధ్య రైల్వే.

దసరా సందర్బంగా ఏకంగా 315 ప్రత్యేక రైళ్లని నడుపుతున్నట్లు వెల్లడించింది. అలాగే కొన్ని స్పెషల్ ట్రైన్స్‌కి అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ తెలిపారు. ఒకవేళ ప్రయాణికుల రద్దీ పెరిగితే అదనపు బోగీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా ప్లాట్‌ఫామ్ టికెట్ల ధరలు కూడా పెంచినట్లు ఆయన ధ్రువీకరించారు. ఇప్పటికే కాచిగూడ, విజయవాడలో రూ. 10 ఛార్జీలను రూ. 20కు పెంచామని.. త్వరలోనే సికింద్రాబాద్ స్టేషన్‌లో కూడా పెంచనున్నట్లు రాకేశ్ తెలిపారు. ఒకట్రెండు రోజుల్లోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫామ్ టికెట్ ఛార్జీలు పెంచుతామని స్పష్టం చేశారు. రైల్వే ప్లాట్‌ఫామ్‌లపైకి అనవసరంగా వచ్చే వారిని నియంత్రించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

### చరిత్రలో నేటినిజం



[illegible]

(అక్టోబర్ 2 కే.కే. మీనన్ జయంతి..) -రాధశ్రీ

సెల్:9494481210



## త్వరలో 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు : కేసీఆర్



వరంగల్,అక్టోబర్ 1: అందర్నీ కలుపుకుపోయే ఈ దేశంలో విద్వేషాలు రగలొద్దు.. విద్వేష రాజకీయాలను గ్రహించి యువత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. వరంగల్‌లో ప్రతిమ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ ప్రసంగించారు.

ఈ దేశం చాలా గొప్ప దేశం. సహనశీలత దేశం. అవసరమైన సందర్భాల్లో త్యాగాలకు సిద్ధపడే దేశం. పోరాటాలతో ముందుకు పోయే దేశం. అందర్నీ కలుపుకుపోయేటటువంటి అద్భుతమైన దేశం. పూలబోకే లాంటి గొప్ప దేశం. ప్రేమతో బతికేటటు వంటి ఈ దేశంలో కొద్ది మంది దుర్మార్గులు.. వాళ్ల స్వార్థ, నీచ ప్రయోజనాల కోసం విషబీజాలు నాటే ప్రయత్నాలు చేస్తున్నారు. అది ఏ రకంగా కూడా సమర్థనీయం కాదు.. ఏ రకంగా కూడా సమాజానికి మంచిది కాదు. నా వయసు అయిపోతుంది. 68 ఏండ్లు కంప్లీట్ కావొస్తుంది. భవిష్యత్ మీది.. ఈ భారతదేశం మీది. విద్యార్థులుగా, యువకులుగా ఈ దేశాన్ని గొప్ప దేశంగా తీర్చిదిద్దుకునే కర్తవ్యం మీ మీద ఉంటది. మెడికల్ విద్యతో పాటు సామాజిక విద్యను కూడా పెంపొందించుకోవాలి. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ముందుకు పోవాలి అని కేసీఆర్ సూచించారు.

### త్వరలో జిల్లాకో మెడికల్ కాలేజీ.. సీఎం కేసీఆర్

రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ త్వరలో రాబోతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. వరంగల్ జిల్లాలో ప్రతిమ మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ?కొత్తగా 12 మెడికల్ కాలేజీలు తెచ్చుకున్నా మన్నారు. అన్ని రంగాల్లోనూ తెలంగాణ నెంబర్ వన్ అన్నారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిందన్నారు. రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర మంత్రులు తిట్టిపోయిన మర్నాడే రాష్ట్రానికి అవార్డులు వస్తున్నాయన్నారు. ఏడేళ్ల కిందటి తెలంగాణకు ఇప్పటి తెలంగాణకు తేడా గమనించండని అన్నారు.

### ఆరోగ్యరంగంలో ఎన్నో అద్భుతాలు సాధించాం.. కేసీఆర్

ఆరోగ్య రంగంలో ఎన్నో అద్భుతాలు సాధించామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. వరంగల్ జిల్లాలో ప్రతిమ మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ? కొత్తగా 12 మెడికల్ కాలేజీలు తెచ్చుకున్నామన్నారు. కేంద్రం సహకరించకున్నా.. 33 జిల్లాల్లో 33 కాలేజీలు ప్రారంభించుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 6500 మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకప్పై రష్యా, ఉక్రెయిన్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యమ సమయంలో చెప్పిన మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయన్నారు.

## 5జీ లింక్ ద్వారా ఢిల్లీ నుంచి స్వీడన్‌లో కారు డ్రైవ్ చేసిన మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 1: ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో శనివారం ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) వేదికగా 5జీ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎరిక్సన్ స్టాల్ నుంచి 5జీ కనెక్షన్ ద్వారా రిమోట్ మోడ్‌లో ప్రధాని మోదీ స్వీడన్‌లో కారును డ్రైవ్ చేశారు.

యూరప్‌లోని ఇండోర్ కోర్స్‌లో వాహనాన్ని ఉంచగా కంట్రోల్స్ ఇవ్వడం ద్వారా కారును నడిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ రిలయన్స్ పెవిలియన్‌ను సందర్శించి జియో గ్లాస్ ద్వారా ట్రూ 5జీ డివైజ్‌లను పరిశీలించారు.

ఇక భారత్‌లో 5జీ సేవలను ప్రధాని లాంఛనంగా ప్రారంభించడంతో యూజర్లు దీపావళి నుంచి 5జీ సేవలను ఆస్వాదించనున్నారు.

ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో వంటి టెలికాం కంపెనీలు త్వరలో 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

వచ్చే ఏడాది డిసెంబర్ 23 నాటికి దేశం నలుమూలలా అన్ని పట్టణాలు, గ్రామాల్లో జియో సేవలు ప్రారంభిస్తామని ఐఎంసీ వేదికపై ఆర్ఐఎల్ అధినేత ముఖేష్ అంబానీ వెల్లడించారు.

## పచ్చని తెలంగాణలో చిచ్చుపెట్టొద్దు..



హైదరాబాద్, అక్టోబర్ 1:వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. పచ్చని తెలంగాణలో చిచ్చుపెట్టొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఏపీ ప్రభుత్వ పెద్దలకు సూచించారు. కరీంనగర్‌లో మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు, కేసీఆర్‌ను విడుదీసేలా ఏపీ మంత్రులు అమర్నాథ్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ దేశం కేసీఆర్ పాలన కోరుకుంటుందన్నారు.

మహారాష్ట్ర, కర్నాటక, ఏపీలో కేసీఆర్ నాయకత్వం కావాలని ఫ్లెక్సీలు వెలిసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సారథ్యంలోని జాతీయ పార్టీ ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనూ పాగా వేస్తామన్నారు. టీఆర్ఎస్ పార్టీ కుటుంబంలాంటిదైతే.. కేసీఆర్ తండ్రిలాంటి వారన్నారు. తమ కుటుంబంలోంచి ఒకరిని వేరుచేసే కుట్రలు ఫలించవచ్చన్నారు. బీజేపీకి బీ టీమ్‌లా పని చేస్తూ.. ఎదురించే ధైర్యం లేకుండా రైతుల పొట్టకొట్టేలా మీటర్లు పెట్టిన ఏపీ ప్రభుత్వం ఎక్కడ.. ధైర్యంగా బీజేపీని ఎదిరించిన సీఎం కేసీఆర్ ఎక్కడ అంటూ ప్రశ్నించారు.

మా సింగరేణిలో, కరెంటులో చౌరబాటేంటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి మార్గదర్శకంగా ఎదుగుతున్న తెలంగాణను ఓర్వలేకుండా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వైసీపీ జతకలిసిందని ఆరోపించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల కన్నా తెలంగాణ పథకాలు ఎలా ఆదర్శమో.. అలాగే ఏపీ విషయంలోనూ హరీశ్‌రావు మాట్లాడారన్న గంగుల.. దీన్ని ఎదుర్కొనే దమ్ములేకనే వ్యక్తిగత హననం చేస్తున్నారని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు సజ్జల ఎక్కడున్నారని ప్రశ్నించిన గంగుల.. జగన్ కుటుంబంలో ఉడుములా చేరి తల్లీ కొడుకుని.. అన్నా చెల్లెల్లను విడదీసినట్టుగా ఇక్కడ చేస్తామంటే కుదరదన్నారు.అమరావతి నుంచి హైదరాబాద్‌కు వలస వస్తున్నారన్నారు. సజ్జల ఏపీ ప్రభుత్వ సలహాదారు అని.. ఆయన వాళ్లకు మూడు, నాలుగు రాజధానుల కోసం సలహాలిచ్చుకొమ్మని.. తెలంగాణ వ్యవహారాల్లో తలదూర్చొద్దంటూ చురకలంటించారు. తెలంగాణ అంటేనే బహుజనుల గడ్డ అని, బహుజనుల బంధు కేసీఆర్ అని, మా వ్యవహారాల్లో తలదూరిస్తే వదిలేదని హెచ్చరించారు. సమావేశంలో కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 1:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు 9 మెడికల్ కాలేజీలు కేటాయించామని కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డికి మంత్రి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. నేను మిమ్మల్ని సోదరుడిగా గౌరవిస్తానని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చే దురదృష్టకర కేంద్ర మంత్రిని చూడలేదన్నారు. తెలంగాణకు 9 మెడికల్ కాలేజీలు కేంద్రం కేటాయించిందని చెప్పడం అబద్ధమన్నారు. కిషన్ రెడ్డికి క్షమాపణ చెప్పే ధైర్యం కూడా లేదన్నారు.హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్ కేంద్రాన్ని నెలకొల్పుతామని ప్రకటించారు. కానీ దాన్ని గుజరాత్‌కు తరలించారని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పటికీ హైదరాబాద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు కానీ.. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదన్నారు. తెలంగాణకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రం ఎందుకు తుంగలో తొక్కుతుందో చెప్పాని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గుజరాత్ బాసులను సంతోషపెట్టడానికి అర్ధ సత్యాలు, తప్పుడు వార్తలను ప్రచారం చేసే వ్యక్తిగా కిషన్ రెడ్డి మారారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రం ఎందుకు తుంగలో తొక్కుతున్నదో ప్రధాని మోదీ చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## మాజీ ఎంపీని పరామర్శించిన సీఎం కేసీఆర్



వరంగల్,అక్టోబర్ 1:సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావును పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన లక్ష్మీకాంతరావు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఆయన ఆరోగ్య వివరాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. వరంగల్‌లో ప్రతిమ మెడికల్ కాలేజీ, క్యాన్సర్ ఆస్పత్రిని కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ తర్వాత కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసానికి వెళ్లి ఆయనను కేసీఆర్ పరామర్శించారు. కేసీఆర్ వెంట మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే సతీశ్ బాబు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డితో పాటు తదితరులున్నారు.

## మహాత్ముని స్ఫూర్తితో రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్: మంత్రి తలసాని



హైదరాబాద్, అక్టోబర్ 1: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు గాంధీజీ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహాత్ముని స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో విగ్రహావిష్కరణ ఏర్పాట్లను మంత్రి తలసాని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మహాత్ముడి జయంతి రోజున బాపూజీని స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు.

ఆదివారం ఉదయం 10.30 ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి సీఎం కేసీఆర్ పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని చెప్పారు. అనంతరం గాంధీ దవాఖాన ముందు ఏర్పాటు చేసిన 16 ఫీట్ల బాపూజీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తారని వెల్లడించారు. తర్వాత దవాఖాన ప్రాంగణంలో సభలో సీఎం పాల్గొంటారని తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

## సముద్రంలో తిరగబడిన బోటు.. ఓ మత్స్యకారుడు మృతి

అమరావతి: అక్టోబర్ 1:వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నది. చేపల వేటకు వెళ్లొద్దని ఏపీ అధికారులు గత కొన్ని రోజులుగా హెచ్చరిస్తున్నారు. అయినా వారి సూచనలు పెడచెవిన పెట్టి పలువురు చేపల వేటకు వెళ్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

తాజాగా అంబేద్కర్‌కోనసీమ జిల్లాలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు సముద్రంలో తిరగబడటంతో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. బోటులోని మిగతా నలుగురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటన అల్లవరం మండలం ఓడలరేవు సాగర సంగమం వద్ద చోటుచేసుకుంది.

ఓడలరేవులోని జెట్టి నుంచి శనివార ఉదయం ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు ఓ బోటులో బయలుదేరారు. సముద్రంలోకి వెళ్లిన కొద్దిసేపటికే గాలి తీవ్రత కారణంగా సముద్ర అలలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో బోటు తిరగబడింది. దాంతో బోటులో ఉన్న ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. నలుగురు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. కాగా, ఒక మత్స్యకారుడు అలల తాకిడి ఎక్కువై ఒడ్డుకు చేరలేక మృతి చెందారు.

బోటులో చేపల వేటకు వెళ్లినవారు కాకినాడకు చెందిన మత్స్యకారులుగా తెలిసింది. ఓడలరేవు సాగర సంగమం వద్ద తిరగబడిన బోటును స్థానిక మత్స్యకారులు కలిసి తీరానికి చేర్చారు. సముద్రం నుంచి ఈదుకుంటూ నలుగురు ఒడ్డుకు చేరడంతో అక్కడి వారు ఊపిరిపీల్చుకున్నారు.

అయితే, ఐదో వ్యక్తి మరణించడంతో విషాదం అలుముకున్నది. మత్స్యకారుడి మృతదేహం ఒడ్డుకు చేరిన తర్వాత ప్రైవేటు వాహనంలో స్థానిక మత్స్యకారులు వారి స్వగ్రామానికి తరలించారు.

## కోట్ల విలువైన కొకైన్‌ను శాండిల్స్‌లో దాచిన మహిళ-పసిగట్టిన కస్టమ్స్ అధికారులు

ముంబై, అక్టోబర్ 1: సుమారు రూ. 5 కోట్ల విలువైన కొకైన్‌ను ఒక మహిళ చెప్పుల లోపల దాచింది. పసిగట్టిన కస్టమ్స్ అధికారులు ఆ శాండిల్స్‌ను కత్తిరించి అందులో దాచిన కొకైన్‌ను బయటకు తీశారు. మహారాష్ట్ర రాజధాని ముంబై అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సంఘటన జరిగింది. సెప్టెంబర్ 29న ఒక మహిళ విదేశాల నుంచి విమానంలో ముంబైకి వచ్చింది. అయితే ఆమె ధరించిన శాండిల్స్‌పై కస్టమ్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. పులి చర్మం డిజైన్‌లో ఉన్న ఆ మహిళ శాండిల్స్‌ను కత్తిరించారు. దీంతో దాని లోపల దాచి ఉంచిన 490 గ్రాముల కొకైన్‌ను బయటపడింది. కస్టమ్స్ అధికారులు దీనిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కొకైన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 4.9 కోట్లు ఉంటుందని తెలిపారు. అనంతరం ఆ మహిళను అరెస్ట్ చేయడంతో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

మరోవైపు కస్టమ్స్ అధికారులు ఆ మహిళ ధరించిన శాండిల్స్‌ను కత్తిరించి అందులో దాచిన కొకైన్‌ను బయటకు తీసిన వీడియోను రికార్డు చేశారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం.. సీపీ చంద్రశేఖర్‌రెడ్డి



కరీంనగర్, అక్టోబర్ 1 (నేటినిజం ప్రతినిధి): : ఆటల్లో రాణించే పోలీస్ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ జిమ్నాస్టిక్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన పోలీస్ కానిస్టేబుల్ ఉదయ్ కిరణ్‌ను సీపీ అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఉదయ్ కిరణ్ సెప్టెంబర్ 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడవ ఆల్ ఇండియా జూడో క్లస్టర్ జిమ్నాస్టిక్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించారు.

ఈ సందర్భంగా బ్రాంజ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ ఉదయ్ కిరణ్‌ను సీపీ ప్రత్యేకంగా అభినందించిన అనంతరం మాట్లాడుతూ? ఆటలు కేవలం దేహ దారుఢ్యానికే కాకుండా, ఆరోగ్యం, మానసికోల్లాసానికి కూడా దోహదపడతాయన్నారు. ఉదయ్ కిరణ్ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ క్రీడాకారులను కూడా ప్రోత్సహిస్తూ, ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, సిఐ ప్రదీప్ కుమార్‌లు పాల్గొన్నారు.

# పోలీసుల వైఖరిని నిలదీస్తూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ నిరసన





అనంతపురం, అక్టోబర్ 1: అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసుల వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర రెడ్డి నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. పోలీసులు, ప్రభుత్వం కుమ్మక్కై మున్సిపల్ నిబంధనలు అతి క్రమిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌లోనే కొనసాగిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఇతర ప్రాంతంలో నిర్మించడానికి పట్టణంలోని మూడు స్థలాలను మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. వీటిలో ఏదేని ఒకటి స్థలంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనానికి స్థల ఎంపిక చేసుకోవాలని సూచించింది.

అయితే మున్సిపల్ సూచించిన స్థలంలో కాకుండా పాత స్థలంలోనే నిబంధనలకు విరుద్ధంగా కొంత స్థలాన్ని ఆక్రమించి భవనం నిర్మాణానికి పోలీసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలీసుల చర్యను నిరసిస్తూ ఆయన నల్లదుస్తులు ధరించి , నల్లటి కళ్లద్దాలను పెట్టుకుని , నల్ల రంగు పట్కా ధరించి పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి, డీఎస్పీ చైతన్యలు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్‌ను బెదిరించి అనుమతి తీసుకున్నారని ఆరోపించారు. వాస్తవానికి ప్రస్తుతమున్న భవనం 121 అడుగులే ఉండగా 190 అడుగులకు అనుమతులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణానికి వ్యతిరేకం కాదని పోలీసులు అవలంభిస్తున్న విధానం సరికాదని ఆరోపించారు.

# 8 మంది ఎర్ర చందనం స్మగ్లర్లు అరెస్ట్.. రూ.1.22 కోట్ల విలువైన దుంగలు స్వాధీనం





చిత్తూరు, అక్టోబర్ 1: ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్న ఎనిమిది మందిని చిత్తూరు పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి పెద్ద ఎత్తున ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.1.22 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. వీరి అరెస్ట్‌తో జిల్లా ఇకపై ఎర్ర చందనం స్మగ్లర్లు కనిపించరని పోలీసులు ధీమాగా చెప్తున్నారు. చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వై రిశాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు తాలూకా పోలీసులు 8 మంది ఎర్ర చందనం స్మగ్లర్లను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 122 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.22 కోట్ల వరకు ఉండనున్నది. చిత్తూరు డీఎస్పీ ఎన్ సుధాకర్ రెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం ఇంటెన్సివ్ వెహికల్ చెకింగ్ డ్రైవ్ చేపట్టగా రెడ్ సాండల్ స్మగ్లర్ల గుట్టు రట్టయింది. శనివారం తెల్లవారుజామున పోలీసులు ఒక లారీ, రెండు కార్లు, ఒక మోటార్ బైక్‌ను ట్రాప్ చేశారు. 8 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అక్కడికక్కడే అరెస్ట్ చేశారు. వీరి వద్ద ఉన్న ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికి తమిళనాడు రాష్ట్రానికి తరలించి భారీ మొత్తంలో ఆదాయం పొందుతున్నట్లు పోలీసులు చెప్పారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్నసీజేఐ జస్టిస్ లలిత్

అనంతపురం, అక్టోబర్ 1: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ తిరుమలలోని శ్రీవారిని దర్శించుకున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు చేరుకున్న జస్టిస్‌కు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు . రాత్రి జరిగే గరుడ సేవలో సీజేఐ పాల్గొననున్నారు.

శనివారం ఉదయం మలయప్పస్వామివారు మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా దర్శనమిచ్చారు. స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఏపీహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.రాజ స్వామివారిని దర్శించుకున్నారు.

# శ్రీవారి గరుడసేవ!.. తిరుమలలో ద్విచక్రవాహనాల రాకను రద్దు చేసిన టీటీడీ





తిరుమల, అక్టోబర్ 1: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపు (శనివారం) రాత్రికి శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడిని అధిరోహించి భక్తులను కనువిందు చేయనున్నారు. ఈ గరుడోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో టీటీడీ, జిల్లా, విజిలెన్స్, పోలీస్‌శాఖ వారు పటిష్ఠ భద్రతను, బందోబస్తును ఏర్పాటు చేశారు. గరుడసేవను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రివిలైజ్డ్ దర్శనాలను టీటీడీ రద్దుచేసింది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా సామాన్యభక్తుల సౌకర్యార్థం సర్వదర్శనం మాత్రమే కొనసాగుతోంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యాలు, రవాణా, భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్టిసి విభాగం తిరుపతి, తిరుమల మధ్య ఆర్టిసి బస్సులతో మొత్తం 3700 ట్రిప్పుల కు పైగా తిప్పనున్నారు. ప్రతి 10 సెకన్లకు ఒకబస్సు భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులను నేడు ఉదయం 10 నుంచి గ్యాలరీలలోనికి భక్తులను అనుమతి స్తామని, ఆ తర్వాత గ్యాలరీలలో ఉండే భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ, త్రాగునీటిని ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా అందిస్తామని టిటిడి తెలిపింది. ఇప్పటికే అలిపిరి నుంచి తిరుమల వరకు రోడ్డు భద్రతకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటున్నారు.

అత్యవసర పరిస్థితులలో భక్తులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు ప్రథమచికిత్స అందచేసేందుకు మెడికల్ కేంద్రాలను, అంబులెన్సులను సిద్ధం చేశారు. టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేస్తూ వాహనం తిరిగేటపుడు నాణేలను విసరవద్దని, దీని వలన ఉత్సవమూర్తు లకు నష్టం వాటిల్లుతుందని, కానుకలు ఇవ్వదలచినవారు వాహనల సేవకు ముందుభాగాన నడిచే మొబైల్ హుండీలలో వేయాలని టిటిడి వారు కోరారు. భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నాలుగు మాడవీధులలో భారికేడ్లను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వివిఐపి, విఐపి, పోలీస్, ప్రెస్, టిటిడి సిబ్బందికి ప్రత్యేకంగా గ్యాలరీలను కూడా ఏర్పాటు చేశారు. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులను ఆసరాగా తీసుకుని దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉందని వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి ప్రత్యేక టీమ్‌లను పోలీస్‌శాఖ సిద్ధం చేసింది.

అంతే కాకుండా తిరుమలలో ప్రధానకూడళ్ళు, మాడవీధులు, పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సిసి కెమరాల ద్వారా అనునిత్యం పరిశీలిస్తూ ఏవరైనా అనుమానితులు తిరుగుతుంటే గుర్తించి వివరాలు సేకరించడానికి సెంట్రల్ కమాడెంట్ కంట్రోల్‌రూమును ఏర్పాటు చేసి నిరంతరాయంగా గస్తీ కాస్తున్నారు. నేడు గరుడసేవ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి ద్విచక్ర వాహనాలను తిరుమలకు పూర్తిగా నిషేదించారు. తిరుపతి, శ్రీవారి మెట్టు మార్గంలో ద్విచక్ర వాహనాలకోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి వాహనాలను కొండక్రిందనే విడిచి తిరుమలకు చేరుకోవాలని టిటిడి, పోలీస్ యంత్రాంగం విజ్ఞప్తి చేశారు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

గరుడసేవ రోజున తిరుమలకు వాహనాలలో వచ్చే యాత్రికులను నియంత్రించడానికి టిటిడి అధికారులు పోలీస్ విభాగాల సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేశారు. తిరుమల లోకి ప్రవేశించగానే ఎక్కడికక్కడ అందుబాటులోని ప్రదేశాలలో వాహనాలను నిలపడానికి ఏర్పాట్లు చేశారు. ఆ పరిస్థితిని ఈ పాటికే పోలీస్, విజిలెన్సు విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించాయి. మరో వైపు గరుడసేవను దృష్టిలో ఉంచుకుని పోలీస్ బందోబస్తును రెట్టింపు చేశారు. గరుడసేవరోజున 4500 మందే కాకుండా మరో 1000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఇప్పటికే ఏర్పాటు చేశారు. మరో వైపు పోలీస్, టిటిడి విజిలెన్సు, సెక్యూరిటి విభాగ అధికారులు కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న నాలుగుమాడవీధులను పూర్తిగా టీటీడీ, విజిలెన్స్, పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. మాడవీధులలో ఉన్న అన్ని మార్గాలను మూసివేసి, కొన్ని ప్రాంతాల లో మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి గరుడసేవకు వచ్చే భక్తులను క్షుణ్ణంగా తనిఖీచేశాక కాని మాడవీధులలోని వాహనసేవల గ్యాలరీలలోకి అనుమతించనున్నారు.

# జిల్లా ప్రజా పరిషత్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు..!

## -వేడుకలలో పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత లక్ష్మారెడ్డి.



సంగారెడ్డి, అక్టోబర్ 1 (నేటి నిజం ప్రతినిధి) శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ ఆవరణలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా మహిళా ప్రజా ప్రతినిధులు, అధికారులు , మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వచ్చిన అతిథులకు జడ్పీ చైర్ పర్సన్ ఘనంగా స్వాగతం పలికారు.

జడ్పీ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్య అతిథులు ముందుగా బతుకమ్మలకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహిళా ప్రజాపతి నిధులు, అధి కారులు,స్థానిక మహిళలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. బతుకమ్మ పాటలతో జిల్లా ప్రజా పరిషత్ మార్మోగిపోయింది.

ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్రీలు పూలను పూజించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలకు విచ్చేసిన అందరికీ

ప్రత్యేకంగా అభినందనలు, పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ వేడుకలలో మంజుల కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మిని క్రాంతి కిరణ్, జయశ్రీ భూపాల్ రెడ్డి, యాదమ్మ మహిపాల్ రెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి, మాధవి రమణ కుమార్ పాల్గొన్నారు.

అనంతరం మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను జగమంతా తెలిసేలా ప్రతి ఏటా ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటున్నామని అన్నారు. పూలను పూజించే పండగే బతుకమ్మని, మహిళలందరూ పూలను గౌరీ దేవిగా ఆరాధించి, ఆటపాటలతో ఆనందించే గొప్ప పండగని అన్నారు. అందరికీ బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీ ఛైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ జడ్పీ లో రెండవసారి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని అన్నారు. పూలను పూజించే గొప్ప సాంప్రదాయం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకే దక్కిందని అన్నారు. అందరూ



ఆయురారోగ్యాలతో ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ దసరా వేడుకలను ఘనంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు. బతుకమ్మ వేడుకలను విజయవంతం చేసిన అందరికీ అభినందనలు తెలియజేశారుఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్మన్ లత విజయేందర్ రెడ్డి, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక మహిళలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు దేవునితో సమానం



మెదక్, అక్టోబర్ 1: నేటినిజం (ప్రతినిధి):తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు దేవునితో సమానమని వారి త్యాగాల వల్ల మనమీనాడు నమాజంలో గౌరవంగా బ్రతకగలుగుతున్నామని, వారిని కంటికి రెప్పలా కాపాడుకో వలసిన బాధ్యత మనపై ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక టి.యెన్.జి.ఓ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల వల్ల పిల్లలలో దేశ సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేవని, క్రమశిక్షణతో మెలుగుతూ పెద్దలపట్ల గౌరవంగా మెలిగేవారని, కానీ నేడు వివిధ కారణాల రీత్యా మానవ సంబంధాలు విచ్ఛిన్నమై, డబ్బు చుట్టూ కాలం తిరుగుతూ ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన తల్లిదండ్రులు, పెద్దలు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, కష్టనష్టాలకోర్చి మనమీ స్థాయికి తీసుకువచ్చారని, వారి త్యాగాలకు మనం ఎల్లవేళలా రుణపడి ఉండాలని అన్నారు. నేటి తరం పిల్లలకి పాఠశాలలు, కళాశాలలో కుటుంబం విలువలు , కుటుంబం పట్ల అవగాహన, తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ, వారి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలని జిల్లా విద్యాశాఖాధారి, ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారులకు సూచించారు. వృద్ధుల సంక్షేమం, వారి పోషణ, సంరక్షణతో పాటు జీవించే హక్కు , ఆస్తి హక్కు వంటి ఎన్నో హక్కులను 2007 చట్టంలో ప్రభుత్వం కల్పించిందని , తమ హక్కులకు భంగం కలిగితే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని లేదా జాతీయ హెల్ప్ లైన్ 14567 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చని అన్నారు. వృద్ధులు 90 ఏళ్ల పై బడి జీవిస్తున్నారంటే వారిలో ఉన్న మానసిక ధైర్యం, దృఢత్వం గుర్తించాలని, వారిపట్ల ప్రేమ, దయ, మమకారం చూపుతూ వారి అనుభవాలను తెలుసుకొని ముందు తరాలకు అందించాలని అన్నారు. అనంతరం వయోవృద్ధులను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ శాలువాలతో సన్మానించారు. అంతకుముందు నరసాపూర్,తునికి, మెదక్ తదితర వృద్ధాశ్రమాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వయోవృద్ధులతో స్థానిక ఆర్.డి.ఓ. కార్యాలయం నుండి టి.యెన్.జి.ఓ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ ప్రారంభించారు. డిఆర్ డిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై ప్రేమ, ఆప్యాయతలు తగ్గాయని అన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించుకుంటూ వారి సంక్షేమానికి ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించుకొని పోషణ, సంరక్షణ పై చర్చించుకోవడానికి సమావేశం కావడం ముదాహమని అన్నారు.స్వీప్ నోడల్ అధికారి రాజీ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో వృద్ధులు, దివ్యంగుల భాగస్వామ్యం మరువలేనిదని, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని భారత ఎన్నికల కమిషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆల్ సర్వీస్ సిటిజన్ సంఘం జిల్లా ఇంచార్జి జగదీశ్ చంద్ర, అధ్యక్షులు అరుంధయ్ రాజ్, జనరల్ సెక్రటరీ శ్యామ్ సుందర్, తునికి నుండి రామానాయుడు వృద్ధాశ్రమం, మెదక్ లోని సంధ్య నిలయం వృద్ధాశ్రమం నుండి వృద్దులు, తదితరులు పాల్గొన్నారు.

# జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



జోగులాంబ గద్వాల, అక్టోబర్ 1: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏకైక శక్తిపీఠం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జోగులాంబ అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించారు. మంత్రికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరిపైనా అమ్మదీవెనలు ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. స్వరాష్ట్రంలో కృష్ణ పుష్కరాలను జోగులాంబ సన్నిధిలో ఘనంగా నిర్వహించామన్నారు. జోగుళాంబ దేవస్థానంలో ప్రసాద్ పథకం ద్వారా భక్తుల సౌకర్యాల నిమిత్తం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, ఇతర స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు ఉన్నారు.

# యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వృద్దులు, పెద్దలు ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలి



మెదక్, అక్టోబర్ 1: నేటినిజం (ప్రతినిధి): ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో నిరంతర సేవలందిస్తు యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వృద్దులు, పెద్దలు ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి రాజి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం నాడు జిల్లాలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ ఓటర్లను గుర్తించి వారికి భారత ఎన్నికల కమిషన్ శుభాకాంక్షలు తెలుపుతూ అందజేసిన సందేశం పత్రాన్ని అందజేయవలసినదిగా సూచించారని ఆయన తెలిపారు. అందులో భాగంగా శనివారం నాడు మెదక్ పట్టణంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోరండ్ల పద్మమ్మ ను ఇంటి వద్దకు వెళ్లి శాలువా కప్పి ఎన్నికల కమిషన్ సందేశం లేఖను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వంద సంవత్సరాలు పైబడిన ఓటర్లు 37 మంది ఉన్నారన్నారు. అందులో మెదక్ నియోజక వర్గంలో 27, నరసాపూర్ నియోజక వర్గంలో 10 మంది ఉన్నారని వారికి బ్లాక్ లెవెల్ అధికారుల ద్వారా ఎన్నికల కమిషన్ లేఖను అందజేస్తామన్నారు. కాగా 80 ఏళ్ళు పైబడిన వృద్దులు, వికలాంగ ఓటర్లు ఎక్కువ సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకొనుటకు వీలుగా ఎన్నికల కమిషన్ వీల్ చైర్, రాంప్, ఉచిత రవాణా, వాలంటీర్లు, క్యూ లేని ఓటింగు సదుపాయాలతో పాటు 12 డి ఫారం ని నింపి ఇంటి నుండే ఓటు వేసే సౌకర్యం కలిగిస్తున్నదని రాజి రెడ్డి తెలిపారు. కమిషన్ కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకొని ఓటు హక్కును వినియోగించుకుంటూ యువతకు స్ఫూర్తిగా, ప్రజాస్వామ్యం పట్ల తమకున్న భాద్యతను ప్రస్ఫుటంగా తెలుపవలసినదిగా కమిషన్ కోరిందని రాజి రెడ్డి తెలిపారు.

# ఏడుపాయల దేవస్థానంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



మెదక్, అక్టోబర్ 1: నేటినిజం ప్రతినిధి ):ఏడుపాయల దేవస్థానంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అమ్మవారికి బంగారు బోనం నమర్పించిన కవిత...పాల్గొన్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ,రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి ఎమ్మెల్సీ కవిత కావెంట్స్100 మంది ఆడపడుచులతో కలిసి



అమ్మవారికి బోనాలు సమర్పించాముఏడూ పాయల ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉందిమల్లన్న సాగర్ అభివృద్ధితో ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందిందిసీఎం కేసీఆర్ ఈ ప్రాంత అభివృద్ధి కోసం 100 కోట్లు కేటాయించారునేను కూడా ఆలయ అభివృద్ధికి నా వంతు సహకారం చేస్తానుఅందరికి సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు

